# నగ్న సత్యం

**- కూరపాటి భాస్కర్ 'క్షితిజ'**

సోమవారం ఉదయం పోస్ట్‌మేన్ లెటర్ ఇచ్చి వెళ్లాడు. సురేష్ దగ్గర నుంచి వచ్చింది. మరీ షార్ట్‌కట్‌గా రాశాడు.

'శనివారం సాయంత్రం వరకు మేమిద్దరం వచ్చేస్తాం. ఆస్పత్రికే వచ్చేస్తాం. ముఖ్యమైన పని ఉంది. పర్సనల్‌గా కలవాలి!'

అక్షరాలు కాస్త అడ్డదిడ్డంగా ఉన్నాయి. బహుశా తొందరలో వ్రాసి వుండవచ్చు. కానీ అంత షార్ట్‌కట్‌గా ఉండడం నాకు అనపేక్షితంగా ఉంది. అతను ఎంత స్మార్ట్‌గా ఉంటాడో అంతకంటే మంచిగా అతని అక్షరాలు ఉంటాయి. ఉత్తరాల కుప్పలోంచీ వెతికి పట్టగలను. అతను నా యంగ్ ఫ్రెండ్. నా అభిమాని. నా రచనలంటే మరీ ఇష్టం. నా రచనల్లో ఏదైనా లోపం వుంటే మంచి గృహిణి బియ్యం లోంచి తెల్ల రాయిని వెతికి పట్టినట్టు ఇట్టే పట్టేసేవాడు.

సురేష్ మొదటి ఉత్తరం నేను వ్రాసిన ఒక కథ చదివి వ్రాసాడు.

''మీ తెలుగు సాహిత్యం అనన్యమైనది. మీరు ఒక డాక్టరే కాక ఒక సాహిత్యకారులు కూడా. అదే నాకు అంతుపట్టని విషయం. మీ రచనల్లో జీవించే పాత్రలు, గ్రామ జీవనం, ఒక సామాన్య పాఠకుడిని ఇట్టే ఆకర్షిస్తుంది. ప్రొఫెషనల్‌గా డాక్టర యినా మీరు మనిషి మనసు కార్డియోగ్రామ్ చూపెట్టగలదు. ఇంకోరకంగా చెప్పాలంటే మీరు మనోవైజ్ఞానికులు కూడా. అనుకూలంగా వుంటే మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను. ఎప్పుడు కలుస్తారు?''

నేను రిటర్న్ ఉత్తరం వ్రాసా.

''మిత్రమా! సాహిత్యంలో పేరున్నవారు, నవోదితులు అని నేనెన్నడూ నమ్మలేదు. నేను పదాలనే నమ్ముతాను. మీ కథ కూడా ఒకటి చదివాను. మీ పదాలలో అనూహ్యమైన శక్తి వుంది. అవునూ, మీ అక్షరాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. సాహిత్య ప్రపంచంలో ఇంత అందమైన అక్షరాలు నేనెన్నడూ చూడలేదు. సమయం తీసుకుని తప్పకుండా వచ్చి కలవండి.''

మూడోరోజే వచ్చాడు.

యంగ్ అండ్ హాండ్సమ్. తెల్లని డ్రెస్సులో వచ్చాడు. అతని బంగారురంగు గడ్డం ఎండకు మెరుస్తుంటే అతను మాటల్లోనే తన గురించి చెప్పేశాడు.

''సార్! నేను చిన్నప్పటి నుంచీ హార్డ్‌షిప్‌లో పెరిగినవాడిని. నాకు మూడేళ్లున్నప్పుడే మా నాన్నగారు తీర్థయాత్రలకు వెళ్లిపోయారు. తరువాత ఆరునెలలకే నేను తల్లిలేని వాడినయిపోయాను. స్వశ్రమతో ముందుకు వచ్చినవాడిని. మూటలు కూడా మోశాను. కుటుంబంలో ఇంకెవ్వరూ లేరు. సాహిత్యాన్ని నమ్ముకుని నేను ఈ స్థితికి వచ్చాను.''

అలా మేము కలిసి మూడేళ్లయినాయి. ఆ తర్వాత సురేష్ ఉత్తరాల వర్షం కురిపించేవాడు. నా శ్రీమతికి కూడా అతని అక్షరాలు నచ్చేవి. అతని ఉత్తరాలకు జవాబివ్వడం లేటయితే దుమ్ము దులిపినంత పని చేసేవాడు. మేం ఎన్నోసార్లు రమ్మని వ్రాసేవాళ్లం. కానీ తీరికలేదని వ్రాసేవాడు. ఆరునెలలముందే అతని పెళ్లి శుభలేఖ వచ్చింది. కానీ ఆరోజే ముంబాయిలో కాన్ఫరెన్స్ ఉండడంవలన వెళ్లలేకపోయాను.

అతని చివరి ఉత్తరం నా టెన్షన్‌ని పెంచింది. ఇంటికి కాక ఇలా హాస్పిటల్‌కి వస్తామని ఎందుకు రాసుంటాడు? అదీను ఇద్దరు కలిసి వస్తామన్నాడు.

ఓసారి గడియారంవైపు చూసాను.

మధ్యాహ్నం పన్నెండు కావస్తోంది. రెండురోజుల్నుంచీ ఏకధాటిగా వర్షం కురిసింది. ఈ రోజు కాస్త తగ్గింది. రెండురోజుల తర్వాత కట్టు తెగినవాటిలా పక్షులు స్వేచ్ఛగా ఎగరసాగాయి. ఎదురుగా పండ్లవాడితో ఎవరో గిరిజన స్త్రీ తగాదా పడుతుంది. ఒక్క పేషెంటూ లేదు. కాంపౌండర్ కన్నయ్య కుర్చీలో కూర్చుని ఆవులిస్తున్నాడు.

నా ఆసుపత్రి ఒక రకంగా చూస్తే ఆసుపత్రికన్నా సాహిత్య నిలయం అనడం ఉత్తమమేమో! ఇదే టేబుల్‌మీద ఎన్నో కథలు వ్రాసాను. ఎందరో సాహిత్యకారులు వచ్చేవారు. వాళ్లతో చర్చలు జరిగేవి. అందువలన నా వ్యవసాయం దెబ్బ తిందనుకోండి. పేషెంట్లకు ఒక సాహిత్యం పిచ్చిగల డాక్టర్‌లానే నేను అగుపడేవాడ్ని. అయినా నాకు ఒరిగే లాభమేమిటంటే వచ్చే ప్రతి పేషెంట్‌తో ఒక్క కథ కూడా పరోక్షంగా వచ్చేది. అందుకే నా కథలు నిజ జీవితానికి దగ్గరగా ఉండేది.

కానీ నా ఆ చెడు కృత్యం వలన ఆ ఊళ్లో కొందరి దృష్టిలో చెడుపేరు తెచ్చుకున్నాను. మనస్ఫూర్తిగా చెప్పాలంటే నాకూ ఆ పని ఇష్టంలేదు. కాలుజారిన పెళ్లికాని ఆడపిల్లలకు బరువెక్కిన హృదయాలతో నేను అబార్షన్లు చేయించేవాడిని.

నాలుగునెలల ముందనుకుంటా ఓ గిరిజన స్త్రీ నా దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు నిండాయి. కారణం ఎవరని ఇంటివాళ్లు అడిగి అడిగి అలసిపోయారు. ఎంతో ప్రయత్నించి తెలుసుకున్నదేమిటంటే ఆమె కడుపుకు కారణం వాళ్ల దూరపుచుట్టమైన బాబాయేనట. మా పనిమనిషి ఎన్నోసార్లు అనేది. ''బాబుగారూ! మీరిసొంటి పని సేయదయ్యా. పాపం తాకితే నరకానికి పోతారు.''

ఇందులో పాపం ఎక్కడుంది? నేను చేసే శాపవిముక్తి పాపమయితే నేను ఈ పాపాన్ని సంతోషంగా నెత్తిన వేసుకుంటాను. కానీ కొన్నివేల సంవత్సరాల క్రిందట కుంతి కథ రిపీట్ కాకుండా చూడడం నా బాధ్యత కాదా? నాకైతే మన సమాజం, సమాజ వ్యవస్థయే లోపయుక్తమైందిగా అనిపిస్తుంది. తన పాపం దాచడానికి ఏమేమో చేసేవారే నా కాళ్లమీద పడ్డ సంఘటనలు కోకొల్లలు. నా భార్యకు కూడా నేను చేసేది నచ్చదు. కానీ నేనున్న పరిస్థితిలోంచి వెనుదిరగడం కష్టం, అసంభవం.

ప్రొద్దునే అభిమానుల ఉత్తరాలు చదువుతుండగా బయటనుంచి మాటలు వినబడ్డాయి. 'లోనికి రావచ్చా డాక్టర్ గారూ!'

అదే వాయిస్, అదే ధ్వని. మూడేళ్లయినా వాయిస్ వెంటనే గుర్తు పట్టేశాను. 'సురేష్' అంటూ లేచి నిలబడ్డాను. ఇద్దరం ఒకరినొకరు హత్తుకున్నాం.

''ఎంత వెయిట్ చేయించావోయ్. నీ గురించే ఆలోచిస్తున్నాను'' నా దృష్టి వెనక్కి మళ్లింది. ఓ స్త్రీ జాగ్రత్తగా మెట్లు ఎక్కుతోంది. ఆమెని మార్చి మార్చి మళ్లీ చూశాను. ఆ వైశాఖ మాసపు మధ్యాహ్నం నా కళ్లముందు కదలాడింది. సురేష్ ఆమెని నాకు పరిచయం చేయబోతుండగా ''సురేష్! నేను మరచిపోలేదనుకుంటే ఈమె సంగీత...''

''అవును. ఈమె సంగీత. నా అర్ధాంగి. సంగీతా! ఈయన డా. భవానీప్రసాద్'' సురేష్ అన్నాడు.

నేను చేతులు జోడించాను.

''నమస్తే'' ఆమె ఎంతో కష్టంగా చెప్పింది.

ఫ్యాన్ స్పీడ్ పెంచి ఇద్దరినీ కూర్చోమన్నట్లు సైగ చేసాను. కన్నయ్య చల్లని నీళ్లిచ్చి వెళ్లాడు.

''మేము తొందరగానే బయలుదేరాం'' అంటూ సురేష్ ''ఈ వర్షమే మాకు శత్రువైందనుకోండి. మొత్తం జలమయం.''

''ఫర్వాలేదు. చెప్పండి ఏంటి అనుకోకుండా...''

''అంత ముఖ్యమైన విషయమేమీ లేదండీ. సంగీతా ఈజ్ గోయింగ్ టు బి ఎ మదర్!''

''వెరీగుడ్. కంగ్రాచ్యులేషన్'' నేను చేయి అందిస్తూ అన్నాను.

''కానీ సమస్యేమిటంటే నాకు ఇప్పుడు పిల్లలు వద్దనుకుంటున్నాం. మీరు మంచి డాక్టర్ కదా. మీ చేతుల మీదుగా ఒక్క కేసూ ఫెయిలవలేదనీ. అందుకనీ...''

నా చేయి పక్షవాతం వచ్చినట్లుగా ఒక్కసారే టేబుల్‌పై విరుచుకుపడింది.

''మీరు లోనికెళ్లి విశ్రాంతి తీసుకోండి'' అంటూ సంగీతనన్నాను.

ఆమె మెల్లగా లోనికెళ్లింది.

''సురేష్! నా మాటలు నీకర్థమవుతాయనుకుంటా. ఏ

తండ్రికైనా తన మొదటి సంతానం ప్రాణంకంటే ప్రియమైనది. నీ మొదటి రచనను ఎవరైనా చించేస్తే నీకెలా అన్పిస్తుంది? సంగీతకు అబార్షన్ చేయించే అధికారం నీకు లేదు. అర్ధమయిందా? నేను ఒక డాక్టర్‌గా కాక ఒక మిత్రునిగా చెబుతున్నాను.''

''కానీ డాక్టర్! సంగీత వయసెంతని? ఆమె ఇప్పటినుంచే ఈ భారం ఎలా మోస్తుంది?''

''ఈ మాట నువ్వంటున్నావా? సంగీత అంటోందా? ఆమె కళ్లల్లోకి ఎప్పుడైనా సూటిగా చూసావా సురేష్! సకల దృష్టిలో దర్శనీయమైనది కేవలం స్త్రీ కళ్లేనని నేననుకుంటా. మాటల్లో చెప్పలేనిది నేత్రాలు చెబుతాయి. 'సంతానంలేని స్త్రీ పరిపూర్ణమైంది కాదు. సృష్టిలో ప్రతి స్త్రీ కోరుకునేది మాతృత్వమే. నీకో విషయం చెప్పనా? లోకం దృష్టిలో నేనొక మంచి డాక్టర్‌నైనా నేనెంత ప్రయత్నించినా తండ్రిని కాలేను. మేమిద్దరం సంతానంలేని భారాన్ని మోస్తున్నాం. మరి నువ్వు సురేష్! ప్లీజ్!'' కళ్లద్దాలు తీసి కళ్లు తుడుచుకున్నాను. కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యమేలింది.

''అయామ్ సారీ డాక్టర్! నేను మిమ్మల్ని బాధపెట్టాను. నేననుకున్నది అది కాదు. నాకో నిజమైన దారి చూపినందుకు థాంక్స్'' సురేష్ బాధతో అన్నాడు.

''స్నేహంలో క్షమాపణలు, ధన్యవాదాలుండవు సురేష్!'' వాతావరణాన్ని తేలికచేస్తూ అన్నాను. తర్వాత గోడపై వున్న పాప బొమ్మను చూస్తూ అన్నాను. ''ఈ విషయం మీ వదినకు తెలిస్తే పిచ్చిదైపోతుంది. పదండి. మనం ఇప్పుడు ఈ ఆనందమైన విషయం మీ వదిన దగ్గరకు తీసుకువెళదాం.''



''లేదు డాక్టర్. మేం ఇప్పుడు రాలేమండీ. తీరిగ్గా కొన్నిరోజులు వుండడానికే వస్తాం'' సురేష్ లేచి నిలబడ్డాడు.

''మంచిది. కానీ మేము...మీరిద్దరు కాదు, ముగ్గురు కొరకు ఎదురుచూస్తాం.''

సంగీత కళ్లల్లో విచిత్రమైన మెరుపు వచ్చింది. వారిద్దరూ బస్టాండ్‌వైపు వెళుతుండగా చూస్తుండిపోయాను. రెండేళ్లక్రిందటి సంఘటన గుర్తుకువచ్చింది.

ఆ సమయంలో నేను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో గైనెక్ డిపార్ట్‌మెంట్‌లో వుండేవాడిని. కొత్తగా అప్పాయింట్ అయినాను. ఆ రోజు మధ్యాహ్నం లంచ్‌టైమ్. మిట్ట మధ్యాహ్నం. హాస్పిటల్ ప్రాంగణం నిర్మానుష్యంగా వుంది. వార్డులోంచి అప్పుడప్పుడు పేషెంట్ల అరుపులు వినిపిస్తున్నాయి. అది తప్ప అంతా ప్రశాంతంగా వుంది. ఛాంబర్‌లో కూర్చుని పేపరు తిరగేయసాగాను. అంతలో ప్రశాంత వాతావరణాన్ని ఛేదిస్తూ ఆటో వచ్చి గేటు ముందు ఆగింది. ఒక ముసలామె, ఒకమ్మాయి దిగారు. నా ముందుకు వచ్చి నిలబడ్డారు. ముసలామె చేతులు జోడిస్తూ-

''అయ్యగారూ! నా పిల్ల బ్రతుకు గంగపాలు కాకుండా కాపాడండి. మా ఇంటి గౌరవం కాపాడండి. మీ మేలు ఎన్నడూ మరువను'' అంటూ విలపించసాగింది.

నేను ఆ అమ్మాయి వైపు చూసాను. సమస్య అర్ధమైంది.

''ఈ అమ్మాయికి పెళ్లి అయిందా? కాలేదా?''

''లేదయ్యా! నేను ఏ రైలు పట్టాలకిందో పడి చస్తే ఈ రోజు చూడవలసి వచ్చేదికాదు'' అంటూ ఏడవసాగింది.

''మీరు ఏడవకండి. బయటకెళ్లి కూర్చోండి'' నేను కొంచెం కోపంగా అన్నాను. ఆ అమ్మాయికి నచ్చచెప్పి విషయం తెలుసుకున్నాను. పక్కింటి కుర్రాడితో ప్రేమలో పడిందట. ఆమె తల్లి వారంరోజులు యాత్రలకెళ్లండి. ఆ అమ్మాయిని ప్రక్కింటివాళ్లకి అప్పగించింది. తర్వాత షరా మామూలే. ఆ అమ్మాయి తల్లికెలా తెలుస్తుందిలే అని అనుకుంది. కానీ నిజం దాగుతుందా?

నా లైఫ్‌లో మొదటి కేసు అది.

ఆ సంగీతనే నేడు... నేను మిత్రద్రోహం చేసాననిపించింది. సురేష్‌కి చెప్పేయాలనిపించింది. కానీ నా మనసు ఎందుకో వద్దంది. జీవితమన్నప్పుడు ఎన్నో విషయాలు, రహస్యాలు ఉంటాయి. వాటిని ఎప్పటికీ దాచేయాల్సిందే. ప్రకృతి క్రూరతత్వంపై నాకు నవ్వు వచ్చింది. పనిమనిషి అన్నట్లు నేను ఓ పాపం నుంచి తప్పించుకున్నాను. పులిబోనులోంచి తప్పించుకున్న జింకపిల్లలా నేను హాయిగా ఫీలయ్యాను. వెంటనే సూర్యుడు మబ్బులను తరిమేసి ప్రకాశిస్తూ నవ్వసాగాడు. నేను వ్రాయడం మొదలుపెట్టా.

★